# ప్రత్యేకహోదా, ఇతర హామీలతోపాటు, ఏపీ పునర్విభజన చట్టం అమలులో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ తీర్మానం

---

అశాస్త్రీయంగా జరిగిన విభజన వల్ల నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం వాటిల్లింది. పార్లమెంటు సాక్షిగా ప్రత్యేకహోదాతో సహా అప్పటి ప్రధాని రాజ్యసభలో ఇచ్చిన హామీలు, 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014'లోని అంశాల అమలులో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి పట్ల రాష్ట్ర శాసనసభ తీవ్ర అభ్యంతరాన్ని, నిరసనను వ్యక్తం చేస్తున్నది.

గత నాలుగేళ్లుగా అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ, 29 పర్యాయాలు ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి, ఇతర కేంద్ర మంత్రులు, అధికారులను ముఖ్యమంత్రి స్వయంగా కలిసి సంప్రదింపులు జరిపినప్పటికీ, వివిధ రూపాల్లో నిరసనను తెలియజేస్తూ ఒత్తిడి పెంచి, ఎన్ని విధాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకోకుండా మొండిగా వ్యవహరించటాన్ని ఈ శాసనసభ గర్హిస్తున్నది.

ప్రత్యేక హోదా ఇవ్వవద్దని 14వ ఆర్థిక సంఘం చెప్పనప్పుడు, ప్రస్తుతం హోదా లబ్దిని పొందుతున్న 11 రాష్ట్రాలకు ఆ ప్రయోజనాలను కొనసాగిస్తున్నపుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేకహోదా హామీని ఎందుకు నెరవేర్చరని ఈ శాసనసభ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది.

ప్రధాని శ్రీ నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పట్ల అవలంభిస్తున్న ఈ నిర్లక్ష్య ధోరణి భారత ప్రభుత్వ ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నట్టుగా ఈ శాసనసభ అభిప్రాయపడుతోంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తప్పనిసరిగా పన్ను రాయితీలతో కూడిన ప్రత్యేకహోదాను ఇవ్వాలని, అప్పటి ప్రధాని ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని, ఏపీ పునర్విభజన చట్టంలో పొందుపరచిన అన్ని అంశాలను వెంటనే సంపూర్తిగా అమలు చేయాలని ఈ సభ డిమాండ్ చేస్తోంది. తద్వారా పార్లమెంటు వ్యవస్థ గొప్పతనాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని కేంద్ర ప్రభుత్వం గౌరవించాలని కోరుతూ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం చేస్తోంది.